ఈనాడు భద్రాద్రి కొత్తగూడెం

నేడు దసరా మహోత్సవాలు



భద్రాచలం, న్యూస్‌టుడే: మహాలక్ష్మి రూపంలో అమ్మవారు శనివారం దర్శనమివ్వనున్నారు. ఈ అమ్మను దర్శించుకుంటే అంతా శుభమే కలుగుతుందన్నది భక్తుల విశ్వాసం. ఇదేరోజు విజయదశమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు ఉంటాయి. మహాపట్టాభిషేకం చేస్తారు. స్వామి వారు దసరా మండపానికి వేంచేస్తారు. ఆయుధ పూజతో పాటు శమీ పూజ జరుపుతారు. శ్రీ రామలీలా మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందులో రావణ వధ ఘట్టం భక్తులకు పరమానందం కలిగిస్తుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జిల్లా వ్యాప్తంగా విజయదశమి వేడుకలకు వివిధ ఆలయాలు ముస్తాబయ్యాయి. నిర్వాహకులు విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తుల దర్శనానికి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.

ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి: కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: దుర్గమ్మ కరుణా కటాక్షాలతో ఈ విజయ దశమి పండుగ జిల్లా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ఆకాంక్షించారు. శరన్నవరాత్రుల్లో దుర్గాదేవిని భక్తిశ్రద్ధలతో కొలిచి.. బతుకమ్మలను తీరొక్క పువ్వులతో పేర్చి ఆడిపాడిన మహిళలు సుభిక్షంగా ఉండాలన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీగా దసరాను ఉత్సాహంగా, ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. జిల్లా అభివృద్ధి పథంలో మరింత వేగంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

16 నుంచి 'బెళగావి' ఎక్స్‌ప్రెస్ పునఃప్రారంభం

కొత్తగూడెం పట్టణం: భద్రాచలం రోడ్ (కొత్తగూడెం) నుంచి కర్ణాటక రాష్ట్రం బెళగావి మధ్య రాకపోకలు సాగించే 'బెళగావి-మణుగూరు-బీజీఎం' ఎక్స్‌ప్రెస్ రైలు ఇక నుంచి ప్రతివారంలో తొలి నాలుగు రోజులు నడుస్తుందని రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. గతంలో అనివార్య కారణాల వల్ల నిలిపివేసిన ఈ రైలును బుధవారం నుంచి పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

● ఈ నెల 16న పాల్వంచ సీహెచ్‌సీలో డయాలసిస్ సేవలు ప్రారంభం

కిడ్నీ బాధితులకు ఉపశమనం

పాల్వంచ వైద్యవిభాగం, న్యూస్‌టుడే

పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం కిడ్నీ బాధితులకు వరంగా మారనుంది. ఖరీదైన వైద్యం ఉచితంగా అందనుంది. ఇప్పటివరకు డయాలసిస్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో కిడ్నీ బాధితులు భద్రాచలం, కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతాల్లో చికిత్స పొందుతూ ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషితో పారిశ్రామిక ప్రాంతంలో డయాలసిస్ సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. ఈ సేవలను ఎమ్మెల్యే ప్రారంభిస్తారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. సాధారణ రోజుల్లో 500కి పైగా, తరుణ వ్యాధుల సీజన్‌లో సీహెచ్‌సీలో ఓపీ 1,000 వరకు నమోదవుతోంది. మన్యం ప్రాంతం నుంచి వచ్చే వారిలో ఎక్కువగా కిడ్నీ సంబంధ వ్యాధులు బయటపడుతున్నాయి. రక్తశుద్ధి సేవలకు డిమాండ్ ఉంది. ఈక్రమంలో 50 పడకల సామర్థ్యంతో అయిదు యూనిట్లతో డయాలసిస్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను డీసీహెచ్‌ఎస్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ రాంప్రసాద్, ఆర్ఎంఓ సోమరాజుదొర పర్యవేక్షిస్తున్నారు.



పాల్వంచలో ప్రారంభానికి సిద్ధమైన డయాలసిస్ కేంద్రం

45 మంది వివరాలు నమోదు

ఇప్పటివరకు పాల్వంచ పరిసర ప్రాంతాల్లో డయాలసిస్ సేవలు లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పటికే పాల్వంచ సీహెచ్‌సీలో చికిత్స కోసం 45 మంది కిడ్నీ రోగులు తమ వివరాలను నమోదు చేయించుకున్నారు. ఒక్కో బాధితుడికి వారంలో రెండు, మూడు సార్లు చికిత్స అందించాల్సి ఉంటుంది.

> పాల్వంచ సీహెచ్‌సీలో డయాలసిస్ కేంద్రం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తిచేశాం. ఎమ్మెల్యే కృషితో డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. కిడ్నీ బాధితుల సమస్యలు తీరనున్నాయి.
> \- రవిబాబు, డీసీహెచ్‌ఎస్

కావాల్సిన వైద్యులను అందుబాటులో ఉంచారు. ఏడాదిగా డయాలసిస్ కేంద్రం కోసం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయి. ఇప్పటివరకు జిల్లాలో కొత్తగూడెం-5, ఇల్లెందు-5, మణుగూరు-5, అశ్వారావుపేట-5, భద్రాచలంలో పది యూనిట్లతో సేవలందిస్తున్నారు. పాల్వంచలో 5 యూనిట్లతో సేవలు బుధవారం నుంచి అందుబాటులోకి రానున్నాయి. చర్లలో డయాలసిస్ కేంద్రాన్ని ఇంకా ప్రారంభించాల్సి ఉంది.

413 మంది కొత్త ఉపాధ్యాయులు రిపోర్టింగ్

పాల్వంచ, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా 'డీఎస్సీ-2024' పరీక్షలో అర్హత సాధించిన సెకండరీ గ్రేడ్ టీచర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ప్రత్యేక విద్య ఉపాధ్యాయులు 413 మంది జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నియామక పత్రాలు అందుకున్నవారంతా జిల్లా కార్యాలయంలో కావాల్సిన పత్రాలు అందజేశారని డీఈఓ ముమ్మడి వెంకటేశ్వరాచారి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు కౌన్సెలింగ్ తేదీ ప్రకటించాల్సి ఉందన్నారు. ఆ తర్వాత కొత్త ఉపాధ్యాయులకు పాఠశాలలను కేటాయిస్తామని తెలిపారు. రిపోర్టింగ్ ప్రక్రియ శుక్రవారం సందడిగా సాగింది. కొత్తగా విధుల్లో చేరిన వారి సందేహాలను పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు నివృత్తి చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్లానింగ్ అధికారి సతీశ్‌కుమార్, ఏఎంఓ నాగరాజశేఖర్ పాల్గొన్నారు.



డీఈఓ వెంకటేశ్వరాచారికి రిపోర్ట్ చేస్తున్న కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు

ఓటు నమోదుపై ఉపాధ్యాయుల్లో నిర్లిప్తత

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటు నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ఎమ్మెల్సీ స్థానంలో ఎన్నికలు నిర్వహించేందుకు ప్రతిసారీ కొత్తగా ఓటు నమోదు చేస్తారు. గతంలో ఉపయోగించిన ఓటరు జాబితాను పరిగణనలోకి తీసుకోరు. గతంలో ఓట్లు వేసినవారైనా తాజాగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉపాధ్యాయుల ఓటు నమోదుకు నవంబర్ 6 వరకు గడువు ఉంది. ఖమ్మం జిల్లాలో ఈనెల 11 వరకు 18 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో అధికారులకు అందాయి. ఓటు నమోదుపై ఉపాధ్యాయుల్లో నెలకొన్న నిర్లిప్తతపై అధికారులు ఆశ్చర్యపోతున్నారు. ఇప్పటికే కలెక్టర్, అదనపు కలెక్టర్ పలుమార్లు సమావేశాలు నిర్వహించి ఉపాధ్యాయులు ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. అయినా జిల్లాలో అర్హులైన ఉపాధ్యాయులు ఓటు నమోదుకు ముందుకు రాకపోవటం వెనుక ఆంతర్యమేమిటో బోధపడటం లేదు. 2019లో ఎన్నికలు నిర్వహించినపుడు జిల్లాలో 2,318 మంది పురుషులు, 1,316 మంది మహిళలు ఓటర్లుగా నమోదయ్యారు. తాజాగా ఈ సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తుండగా ఓటు నమోదుకు మాత్రం దరఖాస్తులు రావటం లేదు.



★ కల్లూరు, కామేపల్లి, కొణిజర్ల, సింగరేణి, తల్లాడ మండలాల నుంచి ఒకటి చొప్పున 5, మధిర 2, సత్తుపల్లి 2, ఖమ్మం రూరల్ 3, ఖమ్మం అర్బన్ మండలంలో 6.. మొత్తమ్మీద 18 దరఖాస్తులు మాత్రమే ఆన్‌లైన్‌లో అధికారులకు అందాయి. ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మధుసూదన్‌నాయక్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా అర్హులైన ఉపాధ్యాయులు నవంబర్ 6 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల ప్రిన్సిపల్స్, హెచ్‌ఎంలు సహా విద్యాశాఖ అధికారులకు ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించామని తెలిపారు.

మిగతా జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి..

ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం పరిధిలో 12 జిల్లాలు ఉండగా పది జిల్లాల నుంచి ఓటు నమోదు దరఖాస్తులు 142 అందాయి. నల్గొండ-38, సూర్యాపేట-22, యాదాద్రి భువనగిరి-8, జనగామ-4, మహబూబాబాద్-8, వరంగల్-11, హనుమకొండ-24, భద్రాద్రి కొత్తగూడెం-6, ఖమ్మం-18, ములుగు జిల్లా నుంచి మూడు దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట జిల్లాల నుంచి ఒక్క దరఖాస్తూ రాకపోవటం గమనార్హం.

ఉపకరణాల ఎంపిక శిబిరానికి 178 మంది హాజరు

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఆవరణలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల ఎంపిక కార్యక్రమం శుక్రవారం జరిగింది. 'ఆర్టిఫిషియల్ లింబ్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆలింకో)' సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగూడెం, పాల్వంచ పరిసర ప్రాంతాలకు చెందిన 178 మంది దివ్యాంగులు హాజరయ్యారు. కలెక్టరేట్‌తో పాటు అశ్వారావుపేట, భద్రాచలం, గుండాలలోనూ శిబిరాలు జరగగా.. మరో 269 మంది హాజరయ్యారని 'ఆలింకో' ఇన్‌ఛార్జి రష్మి రంజన్‌శెట్టి తెలిపారు. వైకల్యాన్ని బట్టి బ్యాటరీ ట్రై సైకిల్స్, వీల్ ఛైర్లు, వినికిడి యంత్రాలు, అంధుల చేతి కర్రలు, చంక కర్రలు, కృత్రిమ అవయవాలను పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అభిషేక్ ద్వివేది, వరప్రసాద్, నాగేశ్వరరావు, నరేష్, ప్రవీణ్, రూప, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి హాజరైన దివ్యాంగులు

రెండు వైద్య పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఒప్పంద పద్ధతిన విధులు నిర్వర్తించేందుకు ఆసక్తి ఉన్న వైద్యులు దరఖాస్తు చేసుకోవాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. రేడియాలజీ, జనరల్ ఫిజిషియన్ నియామకానికి ఈనెల 21న ఉదయం 10 గంటలకు భద్రాచలం ఆసుపత్రిలో మౌఖిక పరీక్షకు హాజరు కావాలన్నారు. రేడియాలజీకి ఎండీ లేదా డిప్లొమా అర్హత ఉండాలని, జీతం రూ.2 లక్షలు, జనరల్ ఫిజిషియన్ ప్రత్యేక వైద్యులకు రూ.1.50 లక్షలు జీతం ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు సంబంధిత ఒరిజినల్, నకలు ధ్రువ పత్రాలతో హాజరు కావాలని సూచించారు.

విజయానికి ప్రతీక.. దసరా

✪ నవరాత్రులు జగన్మాతకు పూజలు ✪ ప్రత్యేక ఆకర్షణగా జమ్మి చెట్టు, నరకాసుర వధ

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దసరా(విజయ దశమి) పండుగను జరుపుకొంటారు. ఖమ్మం నగరంలోని శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామి పారువేట స్థలం, గుట్టలబజారు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఏటా పది రోజుల పాటు విజయదశమి ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తారు.



గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం

పారువేట స్థలం.. చరిత్రకు సాక్ష్యం

ఖమ్మంలో ప్రాచీన కొండపై శ్రీలక్ష్మీనర్సింహస్వామి స్వయంభువుగా వెలిశారని ప్రసిద్ధి. ఏడాదిలో ఒక పర్యాయం మాత్రమే దసరా పండుగ రోజున జనావాసంలోకి వస్తారు. శమీ పూజ కోసం స్వామివారు కొండ దిగి పారువేట స్థలమైన జమ్మిబండ వద్దకు చేరుకొని పూజ చేశారని భక్తుల నమ్మకం. పూర్వం జమ్మిబండ ఊరు బయట అడవి ఉండేది. పారు అంటే ఊరు దాటడం. జమ్మిబండ ప్రాశస్త్యం కాపాడుతూ ఏటా స్వామివారిని



జమ్మిబండ పారువేట స్థలం

ఊరేగింపుగా మేళతాళాలు, భజంత్రీల నడుమ తీసుకొచ్చి పారువేటను వైభవోపేతంగా జరుపుతారు. అక్కడ శమీ పూజ, నరకాసుర వధ చేస్తారు. స్వామివారి శమీ పత్రాలను భక్తులు తీసుకొని జమ్మి చెట్టుకు కట్టి వచ్చే ఏడాది దసరా వరకు తమకు ఎలాంటి ఆపదలు కలగకుండా రక్షించమని వేడుకుంటారు. 200ఏళ్ల క్రితం కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు శ్రీస్తంభాద్రి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకొని గుట్టపై వెలిసిన స్వామివారికి ఆలయంతో పాటు పారువేట స్థల మండపాన్ని నిర్మించారు. కాలక్రమేణా పారువేట స్థలంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు జరుగుతూ వస్తున్నాయి. లకారం చెరువులో స్వామివారి తెప్పోత్సవం జరిగేది. రోజూ జమ్మిబండతో పాటు శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుట్టపై అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. విజయదశమి రోజున జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రముఖుల సమక్షంలో లోక కల్యాణార్థం, ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ స్వామివారికి వేదమంత్రోచ్చారణల నడుమ శమీ పూజ జరిపి అక్షింతలను భక్తులకు పంపిణీ చేస్తారు.

రోజుకో అవతారంలో వాసవీమాత అమ్మవారు

గత 48 ఏళ్లుగా ఖమ్మం గుట్టలబజారులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో విజయదశమి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు పార్వతీదేవి అంశతో వైశ్య కులంలో జన్మించిన గుర్తుగా 1976లో దేవాలయాన్ని నిర్మించారు. నాటి నుంచి ఏటా దేవీ నవరాత్రుల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరుపుతున్నారు. ఇక్కడ భారీ శమీ చెట్టు దర్శనమిస్తుంది. మహిషాసురుడనే రాక్షసుడు మేరు పర్వతంపై బ్రహ్మదేవుడిని పూజించగా ఆయన ప్రత్యక్షమై వరం కోరుకోమని అడిగారు. మహిషాసురుడు తనకు మరణం లేకుండా చూడాలని కోరగా.. ప్రతి ప్రాణి మరణించాల్సిందేనని బ్రహ్మదేవుడు చెప్పడంతో అబల(స్త్రీ) చేతిలో చనిపోవాలని కోరుకుంటాడు. ఈక్రమంలో అమ్మవారు తొమ్మిది రోజులు అవతారమెత్తి చివరి రోజు మహిషాసుర మర్దని అవతారం ఎత్తి రాక్షసుడిని అంతం చేస్తుంది. దీనికి ప్రతీకగా ఆలయంలో విజయదశమి రోజు శమీ పూజ చేయటం ఆనవాయితీగా వస్తోంది.

అంతా రామమయం..!

భద్రాచలం, న్యూస్‌టుడే: అయోధ్య నగరం మనకెంతో ఆరాధ్య ప్రాంతం. మిథిలా నగరం సీతమ్మవారి స్వస్థలం. ఇది ప్రస్తుతం నేపాల్‌లో ఉంది. రావణుడు పాలించిన లంకా నగరం శ్రీలంకలో భాగమైంది. రామాయణంలో ఈ మూడు ప్రాంతాలకు ఎంతో విశిష్టత కలదు. ఈ మహాకావ్యంలో పూజ్యనీయులుగా సీతారాముల వారు ఉన్నారు. ఇలాంటి దేవదేవుడు సీతమ్మవారితో భద్రాచలం ప్రాంతంలో తిరుగాడారు. వనవాసం సమయంలో రాముడు సీతాదేవితో భద్రాచలంలో సేద తీరాడు. త్రేతాయుగంలో ఇక్కడ సంచరించి భద్రుడికి వరమిచ్చారు. ఈ వరం కారణంగా ఆతర్వాత కాలంలో భద్రాచలంలో సీతారామలక్ష్మణులు కొలువయ్యారు. కలియుగంలో భద్రాచలం మహాపుణ్యక్షేత్రంగా భక్తుల పూజలందుకుంటోంది. ఆధ్యాత్మికంగా దర్శనీయ ప్రాంతంగా గుర్తింపు పొందింది.



దర్శనీయం అనుబంధ ఆలయాలు

☆ రామాలయానికి గల అనుబంధ ఆలయాలు ప్రసిద్ధిగాంచాయి. స్థానిక రంగనాయకుల గుట్ట ఎంతో పవిత్రమైన ప్రాంతం. రామాలయానికి అతి సమీపంలో ఉంది. అక్కడ రాములవారి ఆరాధ్యదైవం రంగనాథ స్వామివారు కొలువయ్యాడు. ధ్యాన మందిరం ప్రాంతంలో పూర్వం రామదాసు నివాసం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పాల్వంచ తహసీల్దారుగా విధులు నిర్వర్తించిన సమయంలో భార్య, కొడుకుతో ఇక్కడ కొన్నేళ్లపాటు ఉన్నట్లు నమ్ముతారు. ఇక్కడి నుంచి చూస్తే రామాలయం అందాలు మరింత సుందరంగా కనిపిస్తాయి.

☆ వంతెన నుంచి బయల్దేరి పుణ్యస్నానాలు చేయాలనుకునే వారికి కరకట్ట అందాలు ముచ్చట గొలుపుతున్నాయి. సాయం సంధ్య వేళ విద్యుద్దీపాల కాంతిలో కరకట్ట పైనుంచి గోదావరి ప్రవాహం చూస్తే ఎంతటి వారైనా దాసోహం కావాల్సిందే.

☆ రాములవారు ముఖ్య ఉత్సవాలకు రాజ వీధి గుండా తిరువీధి సేవలో పాల్గొంటారు. తిరువీధి సేవకు వచ్చి స్వామివారు తాతగుడిలో పూజలు అందుకోవడం సంప్రదాయంగా వస్తుంది. తాతగుడి సెంటర్‌లో గోవిందరాజ స్వామివారు కొలువయ్యారు. ఈ ఆలయం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది.

అభయాంజనేయస్వామి ఆలయ దర్శనం

పర్ణశాల ఆలయం భద్రాచలం రామాలయానికి అనుబంధంగా ఉంది. భద్రాచలం నుంచి ఇది 35 కి.మీ. దూరం కలదు. వనవాసం సమయంలో సీతారాముల వారు నివాసం ఉన్న ప్రాంతం ఇది. సీతమ్మవారు నార చీరలు ఆరేసిన ఆనవాళ్లు ఇప్పటికీ కనిపిస్తాయి. సీతాదేవిని అపహరించిన చోట విగ్రహాలను ఏర్పాటు చేశారు.

భద్రాచలం
• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

పామాయిల్ పరిశ్రమ వద్ద భద్రతా ఏర్పాట్ల పర్యవేక్షణ


పామాయిల్ పరిశ్రమ వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న జీఎం సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ సతీష్‌కుమార్, పోలీసులు

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమలో విద్యుత్తు టర్బైన్లను శనివారం ప్రారంభించేందుకు మంత్రులు వస్తున్న నేపథ్యంలో.. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, సతీష్‌కుమార్, సీఐ కరుణాకర్, ఎస్సైలు యయాతి రాజు, సాయి కిషోర్ రెడ్డిలు టర్బైన్, రైతు సదస్సు వేదిక ప్రాంతం, భోజనాల తదితరాలను పరిశీలించారు. ఆయిల్‌ఫెడ్ అధికారులతో ఏర్పాట్లపై చర్చించారు. ఆలపాటి రామచంద్రప్రసాద్, బండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయానికి రూ. లక్ష విరాళం

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం కళాశాల సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీషిర్డీ సాయిబాబా ఆలయానికి భద్రాచలానికి చెందిన పోకూరి పావని, తల్లి రాణితో కలిసి రూ. లక్ష విరాళాన్ని కమిటీ సభ్యులకు శుక్రవారం అందజేశారు. సాయిబాబాకు చేయించతలపెట్టిన స్వర్ణ సింహాసనం(బంగారు పూత) నిమిత్తం తమ వంతు విరాళం అందజేసినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించి దాతలకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

అమాత్యా.. దృష్టి సారించరూ..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే

ఉద్యాన, ఆయిల్‌పాం హబ్‌గా పేరుగాంచిన అశ్వారావుపేట నియోజకవర్గ రైతులు చాలాకాలంగా పలు సమస్యల పరిష్కారానికి ఎదురు చూస్తున్నారు. పామాయిల్ పరిశ్రమలో రూ. 36 కోట్లతో నిర్మించిన విద్యుత్తు టర్బైన్ ప్రారంభోత్సవం, రైతు సదస్సుకు రానున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రహదారుల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రెవెన్యూ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఇక్కడి సమస్యలపై దృష్టి సారించాలని నియోజకవర్గ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


అశ్వారావుపేట పామాయిల్ పరిశ్రమ వద్ద ప్రారంభానికి సిద్ధంగా టర్బైన్

✦ అశ్వారావుపేట నియోజకవర్గం అంటేనే గుర్తుకు వచ్చేది ఆయిల్‌పాం, ఉద్యాన తోటలు. వీటికి పెట్టింది పేరుగా ఉన్న ఈ ప్రాంతంలో ఉద్యాన కళాశాల ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన కలగానే ఉంది. ఇక్కడ ఉద్యాన పరిశోధనా కేంద్రం, కొబ్బరి విత్తనోత్పత్తి క్షేత్రం, పట్టుపరిశ్రమ, అటవీ పరిశోధనా కేంద్రం, ఉద్యాన, వ్యవసాయ కళాశాల, ఆయిల్‌పాం నర్సరీలు ఉన్నాయి. ఇన్ని విధాలుగా విస్తరించిన ఈ ప్రాంతంలో ఉద్యాన కళాశాల ఏర్పాటు చేయాలని చాలాకాలంగా కోరుతున్నారు. తుమ్మల నాగేశ్వరరావు వ్యవసాయ శాఖా మంత్రి పదవి చేపట్టాక కదలిక వచ్చినా మంజూరుకై ఎదురు చూపులు తప్పడంలేదు.

✦ అశ్వారావుపేటలో 1989లో తుమ్మల నాగేశ్వరరావు కృషితో ఏర్పాటైన వ్యవసాయ కళాశాలలో ఏజీబీఎస్సీ వరకూ నాలుగేళ్ల కోర్సు ఉంది. రాష్ట్రంలో హైదరాబాద్ తరువాత స్థాయిలోని ఏజీ కళాశాల ఇదే. అయితే ఇక్కడ వ్యవసాయ పీజీ కోర్సులు లేవు. పంపిన ప్రతిపాదనలు దస్త్రాల్లోనే ఉన్నాయి.

✦ జిల్లాలో సుమారు 4000 ఎకరాల్లో కొబ్బరి తోటలు విస్తరించి ఉన్నాయి. జిల్లాలోనే కాదు తెలంగాణ రాష్ట్రంలోనే కొబ్బరి బోర్డు లేకపోవడంతో రైతులు ఏపీలో విజయవాడలో ఉన్న బోర్డుపై ఆధారపడాల్సి వస్తోంది.

✦ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 85వేల ఎకరాలకు పైగా ఆయిల్‌పాం తోటలు విస్తరించిన ఈ ప్రాంతంలో రెండు పామాయిల్ పరిశ్రమలున్నాయి. ఎనిమిదేళ్లుగా అశ్వారావుపేటలో పామాయిల్ రిఫైనరీ ఏర్పాటు అంశం అపరిష్కృతంగానే ఉంది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లోనూ ఎన్నికల హామీగా ఉన్న రిఫైనరీ ఏర్పాటు కోసం ఈ ప్రాంత రైతులు ఎదురు చూస్తున్నారు.

✦ ఆయిల్‌పాం గెలలకు ధర స్థిరీకరణ చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం దిగుమతి సుంకం తగ్గింపులో మంత్రి తుమ్మల ఏవిధంగా కృషిచేశారో అదే రీతిలో టన్ను గెలల ధర రూ.20వేలు ఉండేలా స్థిరీకరణ చేసేందుకు కేంద్రంపై వత్తిడి తేవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

✦ ఆయిల్‌పాం తోటలు వేసుకున్న రైతులకేగాక ఇతర ఉద్యాన పంటలు వేసుకున్న ప్రతి రైతుకూ బిందు సేద్యం పరికరాలు ఏర్పాటు చేసుకునేందుకు మంజూరు ఇవ్వాలని కోరుతున్నారు.

✦ ఈ ప్రాంత వాసుల నైపుణ్యాభివృద్ధి కోసం, వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి స్కిల్ టెక్నాలజీ సంస్థను ఏర్పాటు చేయాలని ఆకాంక్షిస్తున్నారు.

✦ ఆయిల్‌పాం రైతుకు, తోటలో పనిచేసే కార్మికునికి ఉపయోగపడేలా విద్యుత్తు, పాముకాటు, ఇతర ప్రమాదాల బారిన పడిన సందర్భాల్లో వారి దన్నుగా ఉండేలా బీమా పథకాలు అమలు చేయాలని, ఆ ఖర్చును ఆయిల్‌ఫెడ్ భరించేలా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

✦ నియోజకవర్గంలో సుమారు వంద కి.మీ. నిడివి ఉన్న ములకలపల్లి మండలం మాదారం నుంచి అన్నపురెడ్డి పల్లి మీదుగా సత్తుపల్లి మండలం కిష్టారానికి బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

అశ్వాపురం, న్యూస్‌టుడే: మల్లెలమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో విద్యనభ్యసించిన పదో తరగతి విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 20ఏళ్ల తర్వాత తిరిగి చదువుకున్న పాఠశాలలోనే కలుసుకుని ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు, అటెండరును ఘనంగా సన్మానించారు.

బోనస్ ప్రకటించడం హర్షణీయం

గుండాల, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు బోనస్ ప్రకటించడం హర్షణీయమని కార్మికులు పుష్పరాజు అన్నారు. గుండాలలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చిత్రపటాలకు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. సుధాకర్, బోస్, అశోక్, వీరస్వామి, రమేశ్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామారం గ్రామానికి చెందిన ముంజ సాయిబాబు(28) ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామానికి బతుకుదెరువు కోసం వచ్చారు. సెప్టెంబరు 29నుంచి అతను కనిపించకపోవడంతో అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రతీశ్ తెలిపారు.

మతోన్మాద విధానాలు ప్రమాదకరం

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మతోన్మాద విధానాలు దేశానికి ప్రమాదకరమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. కె.వీరభద్రవరం గ్రామంలో శాఖ మహాసభ శుక్రవారం నిర్వహించారు. వంశీకృష్ణ, అచ్చిరాజు, చంద్రయ్య, వెంకన్నబాబు పాల్గొన్నారు.

మహిషాసురమర్దినిగా శ్రీలలితా పరమేశ్వరి


అశ్వారావుపేట మండలం మామిళ్లవారిగూడెంలో..

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం శాంతినగర్ కాలనీలో కొలువై ఉన్న శ్రీలలితా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహిశాసురమర్దిని అవతారంలో భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. దసరా పండుగను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు, తాగునీరు అందించే ఏర్పాట్లు ఆలయ కమిటీ సభ్యులు చేశారు.

దుమ్ముగూడెం: పర్ణశాలలో అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. లక్ష్మీనగరం, నడికుడి, సీతారాంపురం ఆలయాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం మహిషాసురమర్దిగా అలంకరించారు. కుంకుమ పూజలు, సహస్రనామార్చన నిర్వహించారు.

చర్ల: చినఇంద్రకీలాద్రిలో దుర్గాదేవి అమ్మవారికి విశేష పూజలు, చండీ హోమాన్ని నిర్వహించారు.

అశ్వారావుపేట, అశ్వారావుపేట గ్రామీణం: అశ్వారావుపేటలో అమ్మవారు కాళికాదేవి, మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. డ్రైవర్ల కాలనీలో అన్నదాన కార్యక్రమంలో 2500 మంది భక్తులు పాల్గొన్నారు. శ్రీరంగాపురం, మామిళ్లవారిగూడెం, వినాయకపురం, నారాయణపురం, తదితర గ్రామాల్లో సామూహిక కుంకుమార్చనలు చేశారు.

ములకలపల్లి: శ్రీఉమా పృధ్వీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజ నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం సాగింది.

దమ్మపేట: దేవీ నవరాత్రుల్లో భాగంగా మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. విశేష పూజలు సాగాయి.

పినపాక, న్యూస్‌టుడే: నవరాత్రి ఉత్సవాల్లో పోతురెడ్డిపల్లిలో కొలువైన అమ్మవారు శుక్రవారం భక్తులకు మహిషాసురమర్దినిగా దర్శనమిచ్చారు.

మణుగూరు సాంస్కృతికం: స్థానిక పంచముఖ వేదగాయత్రి మాత ఆలయం, కోదండ రామాలయం, సివిల్ ఆఫీస్ కనకదుర్గ ఆలయాల్లో అమ్మ వారికి సామూహిక పుష్పార్చన నిర్వహించారు.

అశ్వాపురం: మొండికుంటలోని రాజీవ్ వీధిలో నెలకొల్పిన అమ్మవారు కాళీమాతగా భక్తులకు దర్శనమిచ్చింది. మొండికుంట ప్రధాన కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బూర్గంపాడు: సారపాకతో పాటు బూర్గంపాడు, లక్ష్మీపురం, మోరంపల్లి బంజర తదితర గ్రామాల్లో దుర్గామాత అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


భద్రాచలంలో మహిషాసురమర్దినిగా..


అశ్వారావుపేటలో కాళికాదేవి అలంకారంలో


పర్ణశాలలో మహాలక్ష్మి అలంకరణ..


మణుగూరు పీకే-I ప్రాంతంలో..


అశ్వాపురం: మొండికుంటలో కాళికాదేవిగా..

ఘనంగా శ్రీచక్ర, రాజగోపుర ప్రతిష్ఠ

దమ్మపేట, న్యూస్‌టుడే: దమ్మపేట మండలం నాచారం శ్రీజయలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీచక్ర, రాజగోపుర ప్రతిష్ఠా కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, మట్టా రాగమయి పాల్గొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ కార్యాలయ కార్యదర్శి భవానీశంకర్, ప్రత్యేకదళ కమాండెంట్ నరుకుళ్ల త్రినాథ్, ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఆలపాటి రామచంద్రప్రసాద్, మట్టా దయానంద్, ఎల్లిన రాఘవరావు, రావు తదితరులు పాల్గొన్నారు.

✦ ఈనెల 13న సత్తుపల్లి హనుమాన్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవానికి హాజరుకావాలని మంత్రికి ఆలయ కమిటీ వారు ఆహ్వానం అందజేశారు.


నాచారం జయలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

లింగాపురంలో సారాపై సమరం

చర్ల, న్యూస్‌టుడే: మండల పరిధిలోని లింగాపురంపాడులో యువత శుక్రవారం నాటు సారాపై సమరమే చేశారు. గ్రామంలో సారా అమ్ముతున్నారని అధికారులకు తెలిపినా పట్టించుకోక పోవడంపై ఆగ్రహంతో స్థానిక యువకులే దాడులు చేశారు. ఇక నుంచి గ్రామంలో సారా అమ్మితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అమ్మకందార్ల నుంచి సారాను స్వాధీనం చేసుకుని రోడ్లపై పారబోశారు. విచ్చలవిడిగా అమ్ముతున్న సారాతో కుటుంబాల్లో గొడవలు నెలకొని అశాంతి ఏర్పడుతోందని.. దీంతో సారా కట్టడికి చర్యలు చేపట్టినట్లు యువకులు వివరించారు.


సారాను పారబోస్తున్న యువత

కోర్టును పరిశీలించిన ఆర్‌అండ్‌బీ ఈఈ

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు కోర్టుని ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. కోర్టు భవనం, ఆవరణ, పక్కనే ఉన్న కోడిపుంజుల వాగు, వెనక భాగంలోని ఆక్రమణల్ని పరిశీలించారు. కోర్టు ఆధునికీకరణ, ప్రహరీగోడ నిర్మాణానికి రూ.1.65 కోట్ల నిధులు మంజూరైన నేపథ్యంలో వాటి వినియోగంపై జిల్లా న్యాయమూర్తితో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేదరమెట్ల శ్రీనివాసరావు, విజయారావు, మధు, శ్రీకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న డీసీఎం వ్యాను

దమ్మపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట నుంచి సత్తుపల్లికి వస్తున్న సత్తుపల్లి ఆర్టీసీ డిపో పల్లెవెలుగు బస్సును డీసీఎం వ్యాన్ మండలంలోని గట్టుగూడెం క్రాస్‌రోడ్డులో శుక్రవారం వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు వెనుకభాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాద సమయంలో బస్సులో 20మంది ప్రయాణికులు ఉన్నారు. వారిలో ఒకరిద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో ఎవరికి ఎటువంటి ప్రాణాప్రాయం కలుగకపోవటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

పర్సు పోగొట్టుకున్న మహిళకు అందజేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం ఆర్టీసీ బస్టాండులో పర్సు పోగొట్టుకున్న మహిళకు శుక్రవారం 8 గ్రాములు బంగారు ఆభరం ఉన్న పర్సును తిరిగి అందజేశారు. కాకినాడకు వెళ్లేందుకు మహిళ భద్రాచలం బస్టాండులో వేచిచూసి బస్సు ఎక్కారు. ఏపీలోని నెల్లిపాక వెళ్లాక తన పర్సు పోయినట్లు గుర్తించి ఆర్టీసీ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు బస్టాండులో వెతికి దొరికిన పర్సును మహిళకు అందజేశారు.

దాడి ఘటనపై కేసు

ములకలపల్లి: ఆయిల్‌ఇంజను అద్దెచెల్లింపుపై రాజుపేటకు చెందిన గజ్జల రాజుకు పొగళ్లపల్లికి చెందిన గోళ్లముడి వెంకటేశ్వర్లు మధ్య ఈనెల 6న వివాదంతో ఇరువర్గాల పరస్పర దాడి కేసులు నమోదయ్యాయి. కులం పేరుతో దూషించారని మహేష్ ఫిర్యాదులో పేర్కొనడంతో వెంకటేశ్వర్లు, అతడి సోదరుడు బాలకృష్ణలపై ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ కేసు నమోదు చేశారు.

పుస్తక పఠనంతో అపార జ్ఞానం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: పోటీ పరీక్షలతో పాటు పలు రకాల ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన గనులుగా ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. మణుగూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శాఖా గ్రంథాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. గ్రంథాలయంలో పుస్తకాలను చదవడం వల్ల విద్యార్థులు, యువతకు అపారమైన జ్ఞానం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రంథాలయం ప్రారంభానికి కృషి చేసిన తహసీల్దారు రాఘవరెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పుర కమిషనర్ ఉమా మహేశ్వరరావు, గ్రంథాలయ ఇన్‌ఛార్జి గీత, నాయకులు పాల్గొన్నారు.


శాఖా గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం: ఎమ్మెల్యే వెంకటేశ్వర్లును అశ్వాపురం మండల ఏఐటీయూసీ నాయకులు మణుగూరులోని ప్రజాభవన్‌లో శుక్రవారం కలిసి సన్మానించారు. వేల్పుల మల్లికార్జున్, రాజేశ్, శ్రీనివాస్, రాంబాబు పాల్గొన్నారు.

మణుగూరు పట్టణం: సింగరేణి సంస్థ భవిష్యత్తులో మరింత ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. సింగరేణి సంస్థ 700 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించినందుకు మణుగూరు ఏరియా ఓసీ 2 లో కార్మికులకు సహపంక్తి భోజనాలు నిర్వహించారు. జీఎం దుర్గం రామచందర్, లక్ష్మీపతిగౌడ్, రమేశ్, రాంబాబు పాల్గొన్నారు.

✦ సింగరేణి ఒప్పంద కార్మికులకు లాభాల్లో భాగస్వామ్యులను చేస్తూ బోనస్ చెల్లించటంపై హర్షం వ్యక్తం చేస్తూ కార్మికులు ఎమ్మెల్యేను సన్మానించారు.

ద్విచక్రవాహనం ఢీకొని ఒకరికి గాయాలు

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: కాచనపల్లికి చెందిన గొగ్గెల సంపత్ మర్కోడు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతూ చలగట్టవద్ద నడుచుకుంటూ వెళుతున్న ఆ గ్రామానికి చెందిన కోరం సతీష్‌ను ఢీకొట్టాడు. సతీష్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారుడికి కాళ్లు, చేతులకు స్వల్ప గాయాలయ్యాయి. సతీష్‌ను 108లో ఆళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం •ఇల్లెందు



గీత కార్మికుల రక్షణకు కిట్లు అందజేత

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: గీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య కిట్లు పంపిణీ చేస్తోందని కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. నియోజకవర్గం పరిధిలో శిక్షణను పూర్తిచేసుకొన్న 25 మందికి రూ.3.50 లక్షల విలువ చేసే కిట్లను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, ఎక్సైజ్ సీఐ జయశ్రీ, గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు చంద్రగిరి శ్రీను, సాంబయ్య, నర్సింహారావు పాల్గొన్నారు.



కోటమైసమ్మ ఆలయం వద్ద బోనాలతో భక్తులు

కోటమైసమ్మకు బోనాలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: నిజాంపేట కోటమైసమ్మకు పలు గ్రామాల మహిళలు బోనాలను శుక్రవారం చెల్లించారు. అంతకు ముందు నిజాంపేట, రేపల్లెవాడ, కట్టుగూడెం నుంచి కాలినడకన చేరుకున్నారు. శనివారం నుంచి జాతర జరగనుంది.

కష్టాలు కడతేర్చవే కల్పవల్లి..!

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే

శరన్నవరాత్రుల్లో కొలువుదీరి పూజలందుకున్న దుర్గామాత.. తమ కష్టాలను తీర్చాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. రోజుకో రూపంలో అమ్మలగన్న అమ్మను కొలిచామని, ఆమె కరుణ చూపి సమస్యలను పారదోలాలని అన్ని వర్గాల ప్రజానీకం ప్రణమిల్లుతోంది. చెడుపై మంచి విజయం సాధించాలని ఆకాంక్షిస్తోంది. ప్రస్తుత పెడపోకడలతో పెచ్చరిల్లుతున్న నేరాలు తగ్గాలని, సానుకూల వాతావరణం రైతన్నలకు ధాన్యసిరులివ్వాలని, యువత చెడు వ్యసనాలకు విడిచి సన్మార్గంలో నడవాలని, పారిశ్రామిక అభివృద్ధి వేగం పుంజుకోవాలని నేడు 'విజయ దశమి' సందర్భంగా ప్రత్యేక పూజలు జరుపుకోనున్నారు.



మహిషాసుర మర్దినిగా పాల్వంచ పెద్దమ్మతల్లి..

పారిశ్రామిక వెలుగుల 'భాగ్య'మివ్వవే..

'భాగ్యలక్ష్మి' చల్లని చూపు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం పారిశ్రామికాభివృద్ధికి బాటలు పరచాలని శ్రామిక వర్గం కోరుతోంది. కొత్త గనులు ఏర్పాటు కావాలని, ఎన్ఎండీసీకి పునరుజ్జీవంతో నూతన శోభ కలిగించాలని, కేటీపీఎస్‌లో మరో కొత్త కర్మాగారం, జిల్లా కేంద్రంలో నూతన విమానాశ్రయం నెలకొల్పాలని అన్నివర్గాలు నిరీక్షిస్తున్నాయి. కరోనా, సాంకేతిక రంగం ప్రభావంతో చితికిపోయిన తమ బతుకులకు వ్యాపారాభివృద్ధితో ఊపిరిపోయాలని చిరువ్యాపారులు, పట్టణ వాణిజ్య రంగ ప్రతినిధులు దుర్గమ్మను భక్తిశ్రద్ధలతో కొలుస్తున్నారు.

ధాన్య సిరులను కురిపించాలి..

ఇటీవల వర్షాల ప్రభావంతో నియోజకవర్గంలోని రైతుల బతుకుల్లో కడగండ్లు కురిశాయి. పంటలు దెబ్బతిని వేల ఎకరాల్లో నష్టపోయారు. సీజన్ ఆదిలోనే సాగు ఆశలపై అశనిపాతం పడింది. లోకం ఆకలి తీర్చే రైతులే అన్నార్తులుగా మారే పరిస్థితులు చోటుచేసుకున్నాయి. శరన్నవరాత్రుల్లో అన్నపూర్ణగా పూజలందుకున్న దుర్గమ్మ తల్లి వారి కష్టాలను తీర్చాలి. నలుగురికీ అన్నం పెట్టే దాతలుగా రైతులను నిలబెట్టాలి.

మదాంధుల పీచమణచగరా.. మహిషాసుర మర్దిని

నేటి సమాజం మహిళా వ్యతిరేక నేరాలకు కేంద్ర బిందువుగా మారుతోంది. కుటుంబపరంగా ఎదురయ్యే వేధింపులు గృహిణులు, అబలలను అంధకారంలోకి నెట్టేస్తున్నాయి. యువతులకు బయటి వ్యక్తుల రూపంలో అభద్రత ఎదురవుతోంది. కొందరు మృగాళ్లు చిన్నపిల్లల నుంచి పండు ముదుసలి వయసు వారినీ వదలకుండా అఘాయిత్యాలకు తెగబడుతున్న వైనం జంట పట్టణాల్లో ఎక్కడో ఒకచోట బయటపడుతున్నాయి. వరకట్న వేధింపులు, గృహ హింసలు సరేసరి. హత్యాకాండలకు కొత్తగూడెం కేరాఫ్‌గా నిలుస్తోంది. వివాహేతర సంబంధాలు మానవ బంధాలను విచ్ఛిన్నం చేస్తున్నాయి. చెడును సమాధి చేసే మంచికి ప్రతిరూపమై.. మహిషాసురుణ్ని మట్టుబెట్టిన ఆ దుర్గాదేవి నేటి మనుషుల్లోని క్రూర స్వభావాన్ని సమూలంగా అంతమొందించాలి. శాంతి, సుహృద్భావాలకు నియోజకవర్గం నిలయంగా మారాలి.

ప్రకాశించాలి.. విద్యాబుద్ధులు

వేడుకల్లో భాగంగా బాలలు సర్వసతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. తమకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని, జీవితాలను ప్రకాశింపజేయాలని వేడుకున్నారు. గంజాయి, మద్యం వంటి మత్తుకు అలవాటై పెడదారి పడుతున్న కొందరు కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పట్టణాలు, గ్రామీణ యువతలో మార్పునకు అమ్మవారు బీజం వేయాలి. అమ్మ దర్శనం.. వ్యసనాలకు దూరంగా మసలుకునే సద్బుద్ధిని ప్రసాదించాలి. చెడు అలవాట్లు సమసి చదువుల్లో రాణించాలి.

దుర్గమ్మ దర్శనం.. పరమ పావనం

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా పాల్వంచ పెద్దమ్మతల్లి మహిషాసుర మర్దినిగా భక్తులకు శుక్రవారం దర్శనమిచ్చారు. అర్చకులు రుద్రాభిషేకం, రుద్రహోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు. ఈవో రజనీకుమారి పాల్గొన్నారు.



సుజాతనగర్: స్థానిక అమ్మవారికి మహంకాళి అలంకారం

సుజాతనగర్: మండపాల్లో అమ్మవారు మహంకాళి అవతారంలో శుక్రవారం ఘన పూజలందుకున్నారు. సుజాతనగర్‌లో అర్చకులు జనార్దన శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ చేశారు. భవానీమాత దీక్షాధారులు పూజల్లో పాల్గొన్నారు.

జూలూరుపాడు: జూలూరుపాడు, వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీ, గుండెపూడి, కాకర్లలో కుంకుమ పూజలు నిర్వహించారు. పాపకొల్లు, సూరారం, రామచంద్రాపురం గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు దసరా శుభాకాంక్షలను శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్వదినాన్ని ప్రజలు సుఖశాంతులతో జరుపుకోవాలని కోరారు.



జూలూరుపాడు: వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీలో కుంకుమ పూజ..



కొత్తగూడెం కలెక్టరేట్: న్యూ గొల్లగూడెంలో అమ్మవారి విగ్రహాన్ని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ తదితరులు



టేకులపల్లి: స్థానిక బ్రహ్మంగారి వీధిలో మహాచండీయాగం...



కొత్తగూడెం కలెక్టరేట్: హేమచంద్రాపురం రామాలయంలో..



వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఛైర్మన్ డీవీ, నాయకులు

దసరా వేడుకలకు ముస్తాబు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రత్యేకంగా నేడు జరిగే దసరా వేడుకలకు ఇల్లెందు జేకే కాలనీ సింగరేణి క్రీడా మైదానంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుద్దీపాల అలంకరణను మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వరరావు నాయకులతో కలిసి శుక్రవారం పర్యవేక్షించారు. ఈటీవీ 'జబర్దస్త్' కళాకారులు ఫైమా, నూకరాజు, ఇమ్మాన్యుయేలు బృంద హాస్యవల్లరితో పాటు హైదరాబాద్‌కు చెందిన నృత్య, మిమిక్రీ కళాకారుల ప్రదర్శనలు నేడు కొనసాగనున్నాయి. వేడుకల అనంతరం రావణవధ, బాణసంచా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఏరియా జీఎం జాన్‌ఆనంద్ మైదానంలో జమ్మి మొక్కను నాటారు.

ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోండి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా చివరి రోజున నిర్వహించే ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలు, నిర్వాహక కమిటీలు సహకరించాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ సూచించారు. జూలూరుపాడు ఠాణాను ఆయన శుక్రవారం సందర్శించి సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణాప్రతాప్‌లతో సమావేశమయ్యారు. ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. అనంతరం పలు కేసుల విచారణల పురోగతిపై ఆరా తీశారు.

అదృశ్యమైన కేటీపీఎస్ ఉద్యోగి.. శవమై తేలాడు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: అదృశ్యమైన వ్యక్తి మురుగు కాల్వలో శవమై శుక్రవారం తేలాడు. పాల్వంచ గొల్లగూడెం ప్రాంతానికి చెందిన యాసారపు సమ్మయ్య(58) కేటీపీఎస్ జేపీఏ. గతనెల 27వ తేదీన ఇంట్లోంచి బయటకు వచ్చిన ఆయన తిరిగి రాకపోవడంతో భార్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. లారీ అసోషియేషన్ సమీపంలోని మురుగుకాల్వలో సమ్మయ్య మృతదేహాన్ని శుక్రవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పాల్వంచ సీహెచ్‌సీకి తరలించారు.

☆ సమ్మయ్యకు ఇద్దరు భార్యలు, ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు. ఘటనా స్థలానికి వచ్చిన భార్యలు మృతదేహాన్ని తామంటే తాము తీసుకెళ్తామని వాగ్వాదానికి దిగారు. స్థానిక పెద్దలు జోక్యం చేసుకుని చిన్న భార్యకు మృతదేహాన్ని అప్పగించారు. ఎస్సై సుమన్ ఈ ఘటనపై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

సుజాతనగర్, న్యూస్‌టుడే: సీతంపేటకు చెందిన ఇ.ఆదినారాయణ (56) గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు వెంటనే కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమారుడు సాయివర్ధన్ ఫిర్యాదుతో ఎస్సై జుబేదాబేగం కేసు నమోదు చేశారు.

బైకు ఢీకొని ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు

సుజాతనగర్, న్యూస్‌టుడే: నాయకులగూడెంలో గురువారం రాత్రి జరిగిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో గోరింకల మహాలక్ష్మి, మేకల విజయమ్మలు పాల్గొని ఇళ్లకు బయల్దేరారు. వారు రోడ్డు దాటే సమయంలో కొత్తగూడెం వైపు వెళ్తున్న జూలూరుపాడు మండలం పడమటి నర్సాపురానికి చెందిన బూరుగు కిశోర్ ద్విచక్రవాహనంపై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. ఇద్దరు మహిళలకు తీవ్రగాయాలు కావడంతో వెంటనే ఖమ్మంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చెట్ల పొదల్లోకి దూసుకెళ్లిన కారు

సుజాతనగర్, న్యూస్‌టుడే: పాల్వంచకు చెందిన ప్రభాకర్ గురువారం అర్ధరాత్రి దాటాక కారులో ఒక్కరే ఖమ్మం నుంచి వస్తున్నారు. సుజాతనగర్ మండలం నాయకులగూడెం వద్ద నిద్రమత్తులోకి జారుకోవడంతో వాహనం అదుపు తప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఎస్సై జుబేదాబేగం వెంటనే ప్రమాద స్థలం వద్దకు చేరుకున్నారు. కారుల్లో ఇరుక్కున్న ప్రభాకర్‌ను క్షేమంగా బయటకు తీశారు.

ఠాణాకు మట్టి లారీ తరలింపు

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: యానంబైలులోని కరిసెల బోరు గుట్ట నుంచి సమీప వంతెన వద్దకు మట్టి తరలిస్తున్న ఓ లారీని గురువారం రాత్రి స్థానిక పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని ఠాణాకు తరలించారు. ఆ తర్వాత దాన్ని వదిలేశారు. ప్రభుత్వం నిర్మించే వంతెన పనులకు మట్టి తరలిస్తున్నందున లారీని వదిలిపెట్టినట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

ఉద్యోగుల కృషితో సింగరేణికి ఉజ్వల భవిష్యత్తు



కార్పొరేట్ కార్యాలయ ఉద్యోగులను కలిసిన ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్తు కార్మికోద్యోగులతో సాధ్యమని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులు అన్నారు. కార్పొరేట్, కొత్తగూడెం ఏరియాల్లో శుక్రవారం నిర్వహించిన 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర' సదస్సుల్లో వారు పాల్గొని ప్రసంగించారు. నూతన గనుల ఏర్పాటుకు కృషిచేస్తామని అన్నారు. కార్యక్రమాల్లో డైరెక్టర్లు వెంకటేశ్వరరెడ్డి, సత్యనారాయణరావు, ఏరియా జీఎం షాలేమురాజు, ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి, ఏఐటీయూసీ నాయకులు సాబీర్‌పాషా, మల్లికార్జున్‌రావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు రజాక్, ప్రాతినిధ్య సంఘం నాయకుడు త్యాగరాజన్, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్మికులకు సహపంక్తి భోజనాలు వడ్డించారు.

టేకులపల్లి: సింగరేణి సంస్థ మరింత కాలం మనుగడ సాధించాలంటే ఉద్యోగులు తమ పనితీరును మరింత మెరుగుపరుచుకోవాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కోయగూడెం ఉపరితల గనిలో 'ఉజ్వల సింగరేణి-ఉద్యోగుల పాత్ర'పై ఏరియా జీఎం జాన్ ఆనంద్ అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జాన్ ఆనంద్ మాట్లాడుతూ సంస్థ నిర్వహణలో తేనున్న విప్లవాత్మక మార్పులకు కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు సహకరించాలని కోరారు. ఉద్యోగులు, కార్మికులకు సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్, ఏజీఎం(ఐడీ) ఎం.గిరిధర్‌రావు, పీఓ వాసంశెట్టి శ్రీనివాసరావు, మేనేజర్ సౌరభ్‌సుమన్, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, గుర్తింపు సంఘం నేత సారయ్య పాల్గొన్నారు.



టేకులపల్లి: ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

విద్యుత్తు శాఖలో 150 మంది ఉద్యోగుల బదిలీ

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ కొనసాగుతోంది. ఇటీవల ఖమ్మం జిల్లా పరిధిలో బదిలీలు చేపట్టగా తాజాగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పనిచేసే ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. లైన్‌మెన్ల స్థాయి నుంచి సబ్ ఇంజినీర్, ఏడీఈ స్థాయి అధికారులు, ప్రొవెన్షియల్ సిబ్బంది (అకౌంటెంట్లు, జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు) సుమారు 150 మందిని బదిలీ చేస్తూ శుక్రవారం అర్ధరాత్రి వరకు ఆ శాఖ జిల్లా ఎస్ఈ జి.మహేందర్, కొత్తగూడెం, భద్రాచలం డీఈలు ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ జరిగిన ఉద్యోగులంతా ఈ నెల 15వ తేదీలోగా కొత్త స్థానాల్లో బాధ్యతలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా అభివృద్ధిపై మంత్రులు దృష్టి సారించాలి



మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా మంత్రులు హామీలకే పరిమితం కాకుండా జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) రాష్ట్ర నాయకుడు, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. జూలూరుపాడులో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాటలగారడి తప్ప అభివృద్ధి కనిపించడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగునీరందించేందుకు మంత్రులు కృషి చేయాలని కోరారు. జూలూరుపాడులో పత్తి శాశ్వత మార్కెట్ నిర్మాణానికి నిధులు కేటాయించాలని, పంట నష్టపోయిన వారిని ఆదుకోవాలన్నారు. పార్టీ రాష్ట్ర నాయకుడు కెచ్చల రంగారెడ్డి, జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, రాజు, కల్పన, గోపాలరావు పాల్గొన్నారు.

ఆలయానికి వెండి విగ్రహాల సమర్పణ

చుంచుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని బాబు క్యాంప్ కనకదుర్గ దేవాలయంలో శరన్నవరాత్రుల వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలను శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, సీతారాములు దంపతులు, కుటుంబ సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. రూ.11 వేల విలువైన అమ్మవారి వెండి విగ్రహాలను సమర్పించి మొక్కులు తీర్చుకొన్నారు. శ్రీను, సత్యనారాయణ, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఉపాధ్యాయురాలికి అభినందన

పాల్వంచ, న్యూస్‌టుడే: డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వీసంశెట్టి వివేకను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు శుక్రవారం అభినందించారు. జిల్లా స్థాయిలో మహిళా విభాగంలో నాలుగో ర్యాంకులో నిలవడం అభినందనీయమన్నారు.

తపాలా పథకాలపై అవగాహన

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: పోస్టాఫీస్‌లలో లాభదాయక పథకాలతో పాటు బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయని.. గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కొత్తగూడెం సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ రంజిత్ కుమార్ చౌదరి కోరారు. మండలంలోని సాటివారిగూడెం, లోతువాగు, చాతకొండ బ్రాంచ్ కార్యాలయాల్లో శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పొదుపుపై ఆకర్షణీయమైన వడ్డీ రేటును పొందవచ్చన్నారు.

ఈనాడు సినిమా


చిరంజీవి

విశ్వంభర రాకతో

అభిమానులు, సినీ ప్రియుల దసరా వేడుకల్లో 'విశ్వంభర' ఓ భాగం కానుంది. చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న 'విశ్వంభర' టీజర్ శనివారం విడుదలవుతోంది. 'అందరూ ఎదురు చూస్తున్న అతని రాక ఓ వేడుక' అంటూ ఈ విషయాన్ని చిత్రబృందం శుక్రవారం ప్రకటించింది. వశిష్ఠ దర్శకత్వంలో, యు.వి.క్రియేషన్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. త్రిష నాయికగా నటిస్తోన్న ఈ సినిమాని విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. విడుదల తేదీపై నేడు చిత్రబృందం స్పష్టతనిచ్చే అవకాశాలున్నాయి.


బాలకృష్ణ ప్రభాస్ అల్లు అర్జున్ ఎన్టీఆర్ నాని

పరాజయం చెప్పే పాఠం విలువైనదైనా.. ప్రతిభను చాటి చెప్పి ప్రపంచం ముందు హీరోగా నిలబెట్టేది విజయమే. అందుకే జీవితంలో జయాపజయాలు సాధారణమే అయినా ప్రతి ఒక్కరూ విజయం వెంటే పరుగులు తీస్తుంటారు. అయితే ఇతర రంగాలతో పోల్చితే చిత్ర పరిశ్రమలో ఈ విజయాలే సినీ కెరీర్‌కు కీలకంగా నిలుస్తుంటాయి. సినిమా సినిమాకీ మార్కెట్ లెక్కలు పెంచుకుంటూ పోవాలంటే నిలకడగా విజయాల బాటలో పయనం సాగించాల్సిందే. అదే ఇటు తారలకు.. అటు చిత్రసీమకూ శ్రీరామరక్ష. ఇప్పుడిలా వరస విజయాలతో దూసుకుపోతూ తదుపరి చిత్రాల విషయంలో అంచనాల్ని అంతకంతకూ పెంచేస్తున్న హీరోలు తెలుగులో చాలా మందే కనిపిస్తున్నారు. విజయానికి ప్రతీకగా నిలిచే విజయ దశమి సందర్భంగా ఆ తారల చిత్ర విశేషాలివీ..!

అంచనాలు పెంచుతున్న విజయ మంత్రం

వరుస హిట్లతో జోరు చూపిస్తున్న తారలు

కథానాయకులు వరస విజయాలతో జోరు చూపిస్తుంటే సినీప్రియుల్లోనూ.. మార్కెట్ వర్గాల్లోనూ ఓ నూతనోత్సాహం కనిపిస్తుంటుంది. కాకపోతే ఈ పరిశ్రమలో నిలకడగా జైత్ర యాత్ర సాగించడం కత్తిమీద సాము లాంటి వ్యవహారమే. అలాంటిది ఈ మధ్య కాలంలో అగ్ర కథానాయకుల నుంచి కుర్ర హీరోల వరకు పలువురు వరస విజయాలతో బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. దీని కోసం వాళ్లు తెర వెనుక తమదైన రీతిలో శ్రమిస్తున్నారు. ఆలస్యమైనా సరే కథల ఎంపికలో ఆచితూచి అడుగులేయడం.. ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్లుగా కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వడం.. అన్నీ చక్కగా కుదిరాకే ఆయా ప్రాజెక్ట్ కోసం రంగంలోకి దిగడం.. వాళ్లు చేస్తున్న పని. కథానాయకుడు నందమూరి బాలకృష్ణ గత నాలుగేళ్లుగా నిర్విరామంగా జైత్ర యాత్ర కొనసాగిస్తున్నారు. 'అఖండ', 'వీరసింహారెడ్డి', 'భగవంత్ కేసరి' సినిమాలతో హ్యాట్రిక్ విజయాలందుకున్న ఆయన.. భారీ వసూళ్లతో బాక్సాఫీస్‌కు ఫుల్ జోష్‌ను అందించారు. దీంతో ప్రస్తుతం ఆయన నుంచి రానున్న 'ఎన్‌బీకే 109' (వర్కింగ్ టైటిల్)పైనా అంచనాలు భారీగా పెరిగిపోయాయి. బాబీ దర్శకత్వంలో ముస్తాబవుతున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో బాలయ్య రెండు కోణాల్లో సాగే పాత్రలో కనువిందు చేయనున్నారు. 'బాహుబలి' విజయాల తర్వాత వరుస పరాజయాలతో సతమతమైన ప్రభాస్ గతేడాది 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్'తో తిరిగి హిట్ ట్రాక్ ఎక్కిన సంగతి తెలిసిందే. ఇది బాక్సాఫీస్ ముందు దాదాపు రూ.700కోట్ల వసూళ్లు సాధించి సత్తా చాటగా.. ఈ ఏడాది 'కల్కి 2898ఎ.డి'తో దాదాపు రూ.1150కోట్ల పైచిలుకు వసూళ్లు కొల్లగొట్టి గత రికార్డును తిరగరాశారు ప్రభాస్. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'రాజాసాబ్'పై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి. మారుతి తెరకెక్కిస్తున్న ఈ రొమాంటిక్ కామెడీ హారర్ థ్రిల్లర్‌తో ప్రభాస్ హ్యాట్రిక్ కొడతారా లేదా? తెలియాలంటే వచ్చే ఏడాది ఏప్రిల్ 10వరకు వేచి చూడక తప్పదు. ఈసారి దీన్ని పాన్ వరల్డ్ సినిమాగా విదేశీ భాషల్లోనూ విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో ఇది వసూళ్ల పరంగా ఎలాంటి రికార్డులు అందుకుంటుందన్నది సినీప్రియుల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది.

జైత్ర యాత్ర సాగనీ..

చిత్రసీమలో దశాబ్ద కాలం పాటు నిలకడగా జైత్ర యాత్ర సాగించడమన్నది అరుదుగా కనిపిస్తుంటుంది. ఇప్పుడలాంటి ఘనతకు అడుగు దూరంలో ఉన్నారు కథానాయకుడు ఎన్టీఆర్. 2015లో 'టెంపర్'తో మొదలైన తారక్ జైత్ర యాత్ర 'నాన్నకు ప్రేమతో', 'జై లవ కుశ', 'అరవింద సమేత..', 'ఆర్ఆర్ఆర్' విజయాలతో జోరుగా సాగిన సంగతి తెలిసిందే. ఇప్పుడాయన 'దేవర: పార్ట్ 1'తో మరోసారి బాక్సాఫీస్ ముందు జోరు చూపిస్తున్నారు. కొరటాల శివ తెరకెక్కించిన ఈ పాన్ ఇండియా చిత్రం ప్రస్తుతం వసూళ్ల పరంగా రూ.500కోట్ల మైలురాయిని దాటేసింది. ఇక వచ్చే ఏడాది ఎన్టీఆర్ నుంచి 'వార్ 2' వచ్చే అవకాశముంది. హృతిక్‌తో కలిసి చేస్తున్న ఈ మల్టీస్టారర్‌పై ఇప్పటికే ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. ఇది కూడా విజయవంతమైతే దశాబ్ద కాలం పాటు నిర్విరామంగా జైత్ర యాత్ర సాగించిన హీరోగా నిలుస్తారు తారక్. రాశి కంటే వాశి ముఖ్యమని నమ్ముతూ.. ఆలస్యమైనా సరే సినిమాల విషయంలో జాగ్రత్తగా అడుగులేస్తూ వరుస విజయాలతో దూసుకెళ్తున్నారు కథానాయకుడు అల్లు అర్జున్. 'అల.. వైకుంఠపురములో'తో ఫ్లాప్‌లకు చెక్ చెప్పిన ఆయన ఆ తర్వాత 'పుష్ప: ది రైజ్'తో ఏకంగా జాతీయ స్థాయిలో సత్తా చాటారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న 'పుష్ప 2: ది రూల్'పై ఇటు దక్షిణాదిలోనూ.. అటు ఉత్తరాదిలోనూ భారీ అంచనాలేర్పడ్డాయి. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 6న థియేటర్లలోకి రానుంది. ఓవైపు సినిమాల విషయంలో వేగం చూపిస్తూనే.. మరోవైపు విజయాల పరంగానూ దూకుడు చూపిస్తున్నారు కథానాయకుడు నాని. గతేడాది 'దసరా', 'హాయ్ నాన్న' చిత్రాలతో వరుస విజయాలందుకున్న ఆయన.. ఈ ఏడాది 'సరిపోదా శనివారం'తో హ్యాట్రిక్ పూర్తి చేశారు. దీంతో ఇప్పుడాయన నుంచి రానున్న తదుపరి చిత్రాలపైనా అంచనాలు రెట్టింపయ్యాయి. ప్రస్తుతం ఆయన ఓవైపు 'హిట్ 3'ని పూర్తి చేస్తూనే.. మరోవైపు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతోనూ ఓ కొత్త ప్రాజెక్ట్ పట్టాలెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. యువ హీరోలు అడివి శేష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధు జొన్నలగడ్డ కూడా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు.

సల్మాన్ తిరస్కరిస్తే.. షారుక్‌కు స్టార్‌డమ్

మరిన్ని విశేషాలు https://epaper.eenadu.netలో

బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రం


వెంకీ అట్లూరి, నాగవంశీ

'లక్కీ భాస్కర్'గా దీపావళి బరిలో సందడి చేయనున్నారు దుల్కర్ సల్మాన్. ఆయన హీరోగా నటించిన ఈ బహుభాషా చిత్రాన్ని వెంకీ అట్లూరి తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. ఈ సినిమా ఈ నెల 31న విడుదల కానున్న నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు వెంకీ అట్లూరి మాట్లాడుతూ.. "నాకు తెలిసి ఇంత వరకు బ్యాంకింగ్ సెక్టార్‌పై పూర్తి స్థాయి చిత్రమేదీ రాలేదు. అందులో చాలా రకాల కుంభకోణాలు జరుగుతుంటాయి. ఈ సినిమా అదే నేపథ్యంతో ఉంటుంది. డబ్బు సంపాదనపై ఇష్టమున్న ప్రతి ఒక్కరికీ ఈ చిత్రం తప్పక నచ్చుతుంది" అన్నారు. "ఈ నెల 26, 27 తేదీల్లో ఆంధ్ర, తెలంగాణల్లో విడుదల ముందస్తు వేడుకలు నిర్వహించనున్నాం" అన్నారు నిర్మాత సూర్యదేవర నాగవంశీ.

శ్రుతి.. ది డెవిల్ ఈజ్ వెయిటింగ్!


శ్రుతి హాసన్

నవీన్ చంద్ర హీరోగా లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'లెవెన్'. అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. రేయా, శశాంక్, అభిరామి తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. నిర్మాణానంతర పనుల్లో ఉన్న ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే ఈ చిత్రంలో నటి శ్రుతిహాసన్ పాడిన "ది డెవిల్ ఈజ్ వెయిటింగ్" అనే గీతాన్ని హీరో కమల్ హాసన్ విడుదల చేశారు. ఈ పాటకు డి.ఇమ్మాన్ స్వరాలు సమకూర్చగా.. దర్శకుడు లోకేశ్ సాహిత్యమందించారు.

ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదంటున్నారు

'విశ్వం'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు గోపీచంద్. ఆయన హీరోగా నటించిన ఈ చిత్రాన్ని శ్రీను వైట్ల తెరకెక్కించిన సంగతి తెలిసిందే. వేణు దోనేపూడి, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హీరో గోపీచంద్ మాట్లాడుతూ.. "మేము ఏదైతే నమ్మి ఈ చిత్రం చేశామో దానికి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇది కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం" అన్నారు. "ఈ చిత్ర కథను.. అందులోని వినోదాన్ని ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. సినిమా ఒక్క సెకను కూడా బోర్ కొట్టలేదని చెప్పడం ఆనందాన్నిస్తోంది" అన్నారు దర్శకుడు శ్రీను వైట్ల. ఈ కార్యక్రమంలో కావ్య, వేణు దోనేపూడి తదితరులు పాల్గొన్నారు.


వేణు, శ్రీను వైట్ల, గోపీచంద్, కావ్య

వీరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు



భద్రాచలం, న్యూస్‌టుడే: విజయదశమి మహోత్సవాలు భద్రాచలంలో కొనసాగుతున్నాయి. రామాలయం ప్రాంగణంలో రోజుకో రూపంలో అమ్మవారు సాక్షాత్కరిస్తున్నారు. అలంకారాల్లో ఎనిమిదో రోజైన శుక్రవారం వీరలక్ష్మి అమ్మవారు నయనానందభరితం చేశారు. ఈ రూపంలో అమ్మవారిని వీక్షించిన భక్తులు జైజై నీరాజనాలు పలికారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో లక్ష్మీతాయారు కోవెలలో పూజలు చేసి ఉత్సవమూర్తులను వీరలక్ష్మిగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన జరిపారు. రామాయణ పారాయణం మంత్రముగ్ధులను చేసింది.

స్వర్ణ రూపంలో రాములోరి దర్శనం

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వర్ణ కవచాలంకారంలో దేవదేవుడు మెరిసిపోవటంతో భక్తులు మురిసిపోయారు. ఈ రూపంలో ఉన్న అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడికి అర్చకులు సుప్రభాతం పలికారు. క్షేత్ర విశిష్టతను ప్రవచించారు. వైష్ణవ సంప్రదాయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. మాంగళ్య ధారణ రమణీయంగా నిలిచింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని పంచింది. దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. ప్రధాన ఆలయంతో పాటు అనుబంధంగా ఉన్న ఆంజనేయుణ్ని, లక్ష్మీతాయారు అమ్మవారిని భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

15న దాతలకు సన్మానం.. భద్రాచలం రామాలయానికి రూ.లక్ష పైబడి విరాళం అందించిన దాతలకు స్థానిక మారుతీ సదనంలో మంగళవారం సన్మానించనున్నారు. నేరుగా ఆలయానికి వచ్చిన దాతలకు దర్శనం కల్పించి ప్రత్యేక బస్సుల్లో మారుతీ సదనం వద్దకు తీసుకెళ్లనున్నారు. టీ, అల్పాహారం భోజనం ఉంటుంది. దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి సదుపాయం కల్పిస్తారు. సన్మానం తర్వాత స్వామివారి ప్రసాదంగా కండువా, జాకెట్ పీసు, రెండు లడ్డూలు, స్వామివారి చిత్రపటం అందించనున్నట్లు ఈఓ రమాదేవి తెలిపారు.

జమలాపురంలో మహిషాసురమర్దినిగా..



ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం తొమ్మిదో రోజుకు చేరాయి. దుర్గాదేవి అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రాంగణంలో దంపతులచే సామూహిక చండీ హోమం, పూర్ణాహుతి వేడుక జరిపారు. భక్తులు శ్రీవారిని, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, అన్నపూర్ణ భవన్‌లో భక్తులకు అన్నదానం అందించారు. ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, పర్యవేక్షకురాలు కె.విజయకుమారి, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ, మురళీమోహనశర్మ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వన్యప్రాణులు.. వారికి కన్నబిడ్డల్లెక్క!!

మనుషులు కనిపిస్తేనే కాదు, కాస్త అలికిడి వినిపిస్తేనే ఆ వన్యప్రాణులు ఆమడదూరం పరిగెడతాయి. కానీ, కొందరు అటవీ శాఖ సిబ్బందిని చూస్తే మాత్రం ఆప్యాయంగా దగ్గరకొస్తాయి. తమ విధుల్లో భాగంగానే పలువురు సంరక్షకులు వన్యప్రాణులను కన్నబిడ్డల్లా చూసే అరుదైన దృశ్యాలకు కిన్నెరసాని దుప్పుల పార్కు వేదికగా నిలుస్తుంది. ఇక్కడున్న కొమ్ముల దుప్పులు, మూషిక జింకలు, కొండగొర్రెల సంరక్షణ బాధ్యతలను ఆరుగురు సిబ్బంది చూస్తున్నారు. వీరిలో ఇద్దరు మహిళలు రోజూ పచ్చిక కోసి దుప్పులకు ఆహారంగా అందజేస్తారు. ఉదయం, సాయంత్రం క్వింటా దాణాను పిల్లలకు తినిపించినట్టు తినిపిస్తారు. పిల్ల దుప్పులు ఆ మహిళలను చూడగానే గెంతులెత్తుతూ దగ్గరకొచ్చే దృశ్యాలు సందర్శకులను ఎంతో ఆశ్చర్యపరుస్తుంటాయి.

'దుప్పులకు ప్రతిరోజూ ఆహారాన్ని అందిస్తాం. మమ్మల్ని చూస్తే చాలు.. పది అడుగుల దూరంలోంచే ఒక్క అడుగున వచ్చి దగ్గర వాలతాయి. ఓ ఐదారు వన్యప్రాణుల కడుపు నిండే వరకు అక్కడే గడుపుతాం. ఆకలి తీరగానే అవి మళ్లీ మందలోకి వెళ్లడాన్ని చూసి ఎంతో సంతోషమేస్తుంది. వాటిని చూస్తే ఇంట్లో మా పిల్లలు చుట్టూ తిరుగుతున్నారనే భావనే కలుగుతుంది. ఎప్పుడైనా అస్వస్థత కలిగితే మా ప్రాణం విలవిలలాడుతుంది' అని సిబ్బంది జ్యోతి, సభాన 'న్యూస్‌టుడే'తో అన్నారు.

– ఈనాడు, ఖమ్మం, పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే





'ఉపాధ్యాయ రాజుల'దేవరపాడు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: రాజులదేవరపాడు గ్రామానికి చెందిన 10మంది యువతీ, యువకులు డీఎస్సీ ఫలితాల్లో ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. వారిలో వి.శ్రీనివాసరెడ్డి, వి.అప్పిరెడ్డి, వి.మధుసూదన్‌రెడ్డి, డి.కృష్ణవేణి, కె.కోటేశ్వరరావు, వి.రాధారుక్మిణి, ఎల్.తిరుపతిరెడ్డి, డి.గోపికృష్ణ, పి.సాంబయ్య, పి.వెంకటనారాయణలు ఉన్నారు. వీరిని గ్రామస్థులు అభినందించారు.

సింగరేణి ఉజ్వల భవిష్యత్తుకు శ్రమించాలి: సీఎండీ



సదస్సులో మాట్లాడుతున్న సింగరేణి సీఎండీ బలరాంనాయక్

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి సంస్థ ఉజ్వల భవిష్యత్తుకు కార్మికులు కలిసికట్టుగా కృషి చేయాలని సీఎండీ బలరాంనాయక్ కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక జేవీఆర్ ఓసీలో 'ఉజ్వల సింగరేణి... ఉద్యోగుల పాత్ర'పై జీఎం షాలేంరాజు అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. సీఎండీ మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి క్రమక్రమంగా తగ్గిపోతోందని, ఇంగ్లండ్‌లో పూర్తిగా ఆగిపోయిందన్నారు. సోలార్, బయోగ్యాస్ వంటి అనేక రకాల శక్తి వనరులు చొచ్చుక రావటంతో రాబోయే కాలంలో బొగ్గు వనరుకు ఇబ్బందులు తప్పవన్నారు. అందుకే ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. వందేళ్ల వరకు చెక్కు చెదరకుండా సింగరేణి మనుగడ సాగించాలని, సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సూచించారని పేర్కొన్నారు. సోలార్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 5వేల మెగావాట్లకు తీసుకెళ్లేలా కృషి చేస్తున్నామన్నారు. సంక్షేమం, వైద్య విషయంలో కార్మికులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్మికులు కూడా అదే స్థాయిలో సంస్థ అభివృద్ధికి పాటుబడాలన్నారు. బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, లా, ఎంబీబీఎస్ చేసిన వారు కూడా కొలువు కోసం ప్రయత్నిస్తుండటం సింగరేణి గొప్పతనమే అన్నారు. ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో సమస్యలు తన దృష్టికి వచ్చాయని, పరిష్కారానికి ప్రయత్నిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ ప్రభావిత ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని, ఓసీ కారణంగా దెబ్బతిన్న ఇళ్ల సమస్యను పూర్తిస్థాయిలో పరిష్కరించాలని కోరారు. లారీ అసోసియేషన్‌కు లోడింగ్ పెంచాలన్నారు. డైరెక్టర్ సత్యనారాయణ, పీఓలు ప్రహ్లాద, నరసింహారావు, ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, పుర వైస్ ఛైర్‌పర్సన్ తోట సుజలారాణి, కౌన్సిలర్ కంటే నాగలక్ష్మి, ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ నాయకులు రజాక్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రహదారి ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరులో గురువారం రాత్రి వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. తోగ్గూడెం గ్రామానికి చెందిన వాసం సీత(50) సద్దుల బతుకమ్మ ఆడేందుకు వెళ్తుండగా.. రహదారిని దాటుతున్న క్రమంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం ఆమెను ఢీకొంది. ఆమెకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. మణుగూరు మండలం చిక్కుడుగుంట గ్రామంలో ట్రాలీ ఆటో అదుపుతప్పడంతో డ్రైవర్ ఉప్పాక సతీశ్(38) మృతి చెందాడు. సతీశ్ సొంతంగా వాటర్ ప్లాంట్ నడపడంతో పాటు ఆటోలో రవాణా చేస్తుంటారు. వాటర్ క్యాన్లతో ఉన్న ఆటోని నడపుతున్న క్రమంలో అదుపుతప్పి ప్రమాదానికి గురై గాయపడ్డారు. ఇరువురూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బీకేఏఎస్ఆర్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడి అరెస్టు

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: చర్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని పూసుగుప్ప-చర్ల మార్గంలో శుక్రవారం చేపట్టిన తనిఖీల్లో మావోయిస్టు పార్టీ బీకేఏఎస్ఆర్ డివిజన్ ఏరియా కమిటీ సభ్యుడు మడకం కోసయ్య అలియాస్ సుక్రామ్ (24)ని అరెస్టు చేసినట్లు ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. 5 కిలోల బరువున్న ఓ ల్యాండ్ మైన్‌ను ఆయన వద్ద స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. 'కోసయ్య మావోయిస్టు పార్టీలో మిలీషియా సభ్యుడిగా 2018లో చేరాడు. ఏడాది తర్వాత చర్ల ప్లాటూన్‌కు బదిలీఅయ్యాడు. మరో మూడేళ్లు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్ సంరక్షకుడిగా పనిచేశాడు. ఈ ఏడాది ఏసీఎంగా ప్రమోషన్ పొందాడు. భద్రతా బలగాలపై ప్రతీకారం తీర్చుకోవాలనే ఉద్దేశంతో చర్ల-పూసుగుప్ప మార్గంలోని లెనిన్‌కాలనీ శివారులో కల్వర్టుకు ల్యాండ్‌మైన్ అమర్చేందుకు శుక్రవారం వచ్చాడు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి అరెస్టు చేశాం' అని ఎస్పీ వెల్లడించారు. మరో ఇద్దరు నిందితులు పారిపోయినట్లు చెప్పారు. కోసయ్య 50కి పైగా హింసాత్మక ఘటనల్లో పాల్గొన్నాడని, ఈయనపై రూ.4లక్షల రివార్డు ఉందన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ వివరాలు తెలిపారు. ఓఎస్‌డి సాయిమనోహర్, మణుగూరు డీఎస్పీ వంగా రవీందర్‌రెడ్డి, చర్ల సీఐ రాజువర్మ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి. రోహిత్‌రాజు